క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ. 1.53 లక్షలు విరాళం



మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానానికి మచిలీపట్నానికి చెందిన భక్తులు కొల్లిపర నాగ వెంకట శ్రీకాంత్, లక్ష్మీ సుస్మిత దంపతులు రూ. 1.53 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు అందించారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



పెదప్రోలు(మోపిదేవి): పీఏసీఎస్ సొసైటీ సభ్యురాలు కణతం సీతమ్మ (70)మృతిచెందింది. మట్టిఖర్చుల నిమిత్తం ఆమె కుమారుడు వెంకట దుర్గారావుకు రూ. 10 వేలను ఆదివారం అందజేశారు. సొసైటీ త్రిమెన్స్ కమిటీ సభ్యులు కొల్లూరి రాజు, కందుల నాగ భూషణం సొసైటీ కార్యదర్శి మార్గాని నాగమణి పాల్గొన్నారు.

● కోసూరువారిపాలెం పీఏసీఎస్ సొసైటీలో సభ్యత్వం కలిగిన రేపల్లే సీతారామాంజనేయులు ఇటీవల మృతిచెందారు. మృతుని మట్టిఖర్చుల నిమిత్తం ఆయన కుమార్తె వైష్ణవికి రూ. 10వేలు ఆర్థిక సాయాన్ని పీఏసీఎస్ చైర్ పర్సన్ కోసూరు కోటేశ్వరరావు ఆదివారం అందచేశారు. సర్పంచ్ కోసూరు అనూష, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రామాలయం నిర్మాణానికి విరాళం

నాగాయలంక(అవనిగడ్డ): నాగాయలంక మండల పరిధిలోని జింకపాలెంలో రామాలయం నిర్మాణానికి శ్రీ రామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిశోర్ నాయుడు రూ.10 వేలు విరాళం అందజేశారు. ఆదివారం రామాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో శ్యాంకిశోర్ నాయుడు ఈ మొత్తాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు.

ఈక్రాప్ నమోదుకు నేటితో గడువు పూర్తి

పెడన: రబీ పంటకు సంబంధించి ఈక్రాప్ నమోదు గడువు సోమవారంతో ముగుస్తోందని ఏఓ జీవీ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తక్షణం తమ సమీపంలోని ఆర్బీకేలలో ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. పెడన మండలంలో ఇప్పటి వరకు 75 శాతం పూర్తయిందని, మిగిలిన రైతులు త్వరితగతిన ఈక్రాప్, ఈకేవైసీ చేయించుకోవాలని పేర్కొన్నారు.

విద్యార్థి చదువుకు సాయం



మచిలీపట్నంటౌన్: విజయవాడ గుణదలకు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి కాకర్లమూడి శామ్యూల్ జాషువా చదువుకు నగరంలోని బెరాకా మినిస్ట్రీస్ నిర్వాహకుడు కిరణ్‌పాల్ రూ. 25 వేలు సాయం చేశారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును బెరాకా మినిస్ట్రీస్ బోర్డు సభ్యుడు గోపాలకృష్ణ చేతుల మీదుగా ఆదివారం కళాశాల ప్రిన్సిపాల్ పేరుపై అందజేశారు. విద్యార్థి జాషువా కృతజ్ఞతలు తెలిపాడు.

అభివృద్ధి చకచకా

- అభివృద్ధిపథంలో బందరు నియోజకవర్గం
- నాడు–నేడుతో పాఠశాలలకు నూతన శోభ
- జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాలు వేగవంతం
- పలు ఆలయాల పునర్నిర్మాణం



నాడు - నేడులో అభివృద్ధి చెందిన రుస్తుంబాద ప్రైమరీ బాలుర పాఠశాల

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన అనంతరం పాఠశాలలు, ఆలయాలు, పక్కాగృహాల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో నియోజకవర్గంలో ఆ దిశగా అడుగులు పడ్డాయి. అధ్వానంగా ఉన్న పాఠశాలలు నేడు సుందరంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఆలయాలు పూర్వ వైభవాన్ని సంతరించుకుంటున్నాయి. జగనన్న లేఅవుట్లలో పక్కా గృహాల నిర్మాణాన్ని లబ్ధిదారులు ఉత్సాహంగా చేస్తున్నారు. నియోజకవర్గంలో ఈ పనులు శరవేగంగా సాగేందుకు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ప్రత్యేక చొరవ చూపుతూ ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు.

రూ. 34.88 కోట్లతో పాఠశాలల అభివృద్ధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలల అభివృద్ధిపై దృష్టి సారించిన అనంతరం నాడు - నేడు పథకం ద్వారా నియోజకవర్గంలో మొదటి విడతలో రూ. 13.08 కోట్లతో 67 పాఠశాలలకు అదనపు తరగతి గదులు, కాంపౌండ్‌వాల్స్, టాయిలెట్స్, ఫ్లోరింగ్, రంగులు వంటి పనులను నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని నగర పాలక సంస్థలో 30, మండలంలో 37 పాఠశాలలను అభివృద్ధి చేశారు. రెండో విడతలో రూ. 21.80 కోట్లతో 59 పాఠశాలలు, లేడియాంప్తిల్ జూనియర్ కళాశాలలో అదనపు తరగతి గదులు, టాయిలెట్స్ నిర్మాణం చేపట్టారు. మండల పరిధిలో 44, నగర పరిధిలో 15 పాఠశాలలు, ఏడు అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

రూ. 6.16 కోట్లతో ఆలయాల అభివృద్ధి..

నియోజకవర్గంలో నగర పాలక సంస్థతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాలు శిథిలావస్థకు చేరాయి. ఈ విషయాన్ని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి నిధుల మంజూరుకు కృషి చేశారు. కామన్ గుడ్ ఫండ్ నిధులను రాబట్టి నియోజకవర్గంలోని పలు ఆలయాలను రూ. 6.16 కోట్లతో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. పలు ఆలయాల పనులు తుది దశకు చేరాయి. గొడుగుపేట వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని రూ. 1.80 కోట్ల సీజీఎఫ్ నిధులు, రూ. 20 లక్షలు దాతల సాయంతో జీర్ణోద్ధరణ చేశారు. ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఈ నెల 27, 28, మార్చి ఒకటి తేదీల్లో నిర్వహించేందుకు పండితులు ముహూర్తం ఖరారు చేశారు. నిజాంపేటలోని బొబ్బిలి వేణుగోపాలస్వామి ఆలయ గాలిగోపురం జీర్ణోద్ధరణ పనులను రూ. 36 లక్షలతో చేపట్టారు. ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆలయ ప్రహరీ నిర్మించనున్నారు. బందరుకోటలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం రూ. 35 లక్షలతో, శ్రీ కంచి కామేశ్వరి సమేత ఏకాంబరేశ్వరస్వామి ఆలయాన్ని రూ. 35 లక్షల సీజీఎఫ్ నిధులతో అభివృద్ధి చేస్తున్నారు. ఈ పనులు చివరి దశకు చేరాయి. ఈ రెండు ఆలయాలకు దాతలు రూ. 11.60 లక్షల చొప్పున విరాళాలతో నిర్మాణం చేస్తున్నారు. ఎమ్మెల్యే పేర్ని నాని సతీమణి జయసుధ సుమారు రూ. 3 లక్షలు విరాళంగా అందజేశారు. తపసిపూడిలోని నాగేశ్వరస్వామి ఆలయం పునర్నిర్మాణ పనులు రూ. 50 లక్షలతో జరుగుతున్నాయి. బుట్టాయిపేటలోని సీతారామస్వామి ఆలయం పునర్నిర్మాణానికి రూ. 77 లక్షలు మంజూరయ్యాయి. రంగనాయకస్వామి ఆలయంలో ముఖమండపం, క్లోజ్‌డ్ మండపం అభివృద్ధికి రూ. 50 లక్షలు మంజూరయ్యాయి. ఎన్.గొల్లపాలెంలో నాగేశ్వరస్వామి నూతన ఆలయం నిర్మాణానికి రూ. 1.10 కోట్లు మంజూరయ్యాయి. ఇలా నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులు ఎమ్మెల్యే చొరవతో యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి.



నిజాంపేటలోని బొబ్బిలి వేణుగోపాలస్వామి ఆలయ గాలి గోపురం నిర్మాణ పనులు

రూ. 21.80 కోట్లతో గృహ నిర్మాణాలు..



రుద్రవరంలో జగనన్న లేఅవుట్‌లో నిర్మాణం జరుగుతున్న గృహాలు

నియోజకవర్గంలో జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. నియోజకవర్గంలో మొత్తం 5,941 గృహాలు మంజూరుకాగా వీటిలో బేస్‌మెంట్‌కు ముందు దశలో 3,879, బేస్‌మెంట్ దశలో 564, రూఫ్‌లెవల్‌లో 189, రూఫ్ క్యాస్ట్ దశలో 88 ఉండగా, 833 గృహాల నిర్మాణం పూర్తయ్యింది. ఈ నిర్మాణాలకు ఇప్పటి వరకు రూ. 21.80 కోట్లను ఖర్చు చేశారు.

మంచి సేవలతో ఆదర్శంగా నిలుద్దాం

మంత్రి జోగి రమేష్



మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

పెడన: గృహ సారథులు ప్రజలకు మంచి సేవలు అందించి ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. స్థానిక గూడూరు రోడ్డులోని దేవాంగ కల్యాణ మండపంలో వలంటీర్లు, సచివాలయ సమన్వయకర్తలు, గృహ సారథుల శిక్షణ కార్యక్రమంలో ఆదివారం నిర్వహించారు. మార్చి 18 నుంచి ప్రతి గృహానికి వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలను వివరించి అవి బాగున్నాయా లేదా తెలుసుకోవాల్సి ఉంటుందన్నారు.

ప్రజలకు సంక్షేమ పాలన అందించడం వల్లే ఎన్నికలకు సింగిల్‌గా వెళతామని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోలేకే పవన్ కల్యాణ్‌ను చంద్రబాబు కలిశారని విమర్శించారు. కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ భళ్ల జ్యోత్స్నరాణి, వైస్ చైర్మన్లు ఎండీ ఖాజా, బైలపాటి జ్యోతి, ఫ్లోర్‌లీడర్ కటకం ప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బందారు మల్లి పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు మండలంలోని వారికి సుమ కన్వెన్షన్ హాల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ గృహ సారథులు, వలంటీర్లు, సమన్వయకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఎంపీపీ మధుసూదనరావు, జెడ్పీటీసీ వేముల సురేష్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్ నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవాలు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లిలోని దుర్గా పార్వతి సమేత నాగేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా శనివారం రాత్రి నాగేశ్వరస్వామి వారి దివ్య కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, రాత్రి ఒంటి గంటకు స్వామి వారి ఎదుర్కోలు ఉత్సవం, రెండు గంటలకు దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవం నిర్వహించారు. తెల్లవారు జాము ఐదు గంటలకు స్వామి వారు, అమ్మవార్లను నందివాహనంపై ఉంచి గ్రామోత్సవం జరిపారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

దుర్గా కోటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం..

కె. కొత్తపాలెం(మోపిదేవి): కె. కొత్తపాలెం దుర్గా కోటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు రామిశెట్టి రామకృష్ణ, నాగరాణి దంపతుల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ చైర్మన్ చందన రామచంద్రయ్య, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. ఆదివారం ఉదయం విఘ్నేశ్వర పూజ, దుర్గా హోమం, అపమృత్యుహోమం, స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, నిత్యబలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కృత్తివెన్నులో..

కృత్తివెన్ను: కృత్తివెన్ను శివాలయంలో శనివారం రాత్రి 10.45 గంటలకు దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి, రమా సహిత వీర వెంకట సత్యనారాయణ స్వామి వార్ల కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. వివాహ ఘట్టాన్ని పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ పట్టపు నాగేశ్వరరావు, ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు, చిలూకూరి చంద్రశేఖర్ దంపతులు కల్యాణాన్ని జరిపించారు. ఒకే వేదికపై శివకేశవులకు కల్యాణం జరిపించడం అరుదైన అంశమని, కృత్తివెన్నులో ప్రతి ఏటా ఇరువురి దేవుళ్లకు ఒకే వేదికపైన కల్యాణాన్ని నిర్వహిస్తున్నామని అర్చకులు మురళీకృష్ణ తెలిపారు. అనంతరం స్వామివారికి లింగోద్భవకాలం (పంచదారతో) అభిషేకించారు.



స్వామి వార్ల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



కృత్తివెన్ను శివాలయం వద్ద అలంకరణలో స్వామివార్లు



కె. కొత్తపాలెంలో స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

మార్మోగిన శివనామ స్మరణ

బంటుమిల్లి: మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని శివాలయాలు శనివారం రాత్రి భక్తులతో కళకళలాడాయి. శనివారం అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో వేద పండితుల వేద మంత్రాల మధ్య మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు జరిగాయి. పెదతుమ్మిడి పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి, బంటుమిల్లి గంగా, పార్వతి సమేత చంద్రమౌళేశ్వరస్వామి, అర్తమూరు అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, పార్వతీ సమేత రామేశ్వరస్వామి, ములపర్రు పార్వతీ సమేత నాగేశ్వరస్వామి తదితర ఆలయాల్లో రుద్రాభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉపవాసాలున్న భక్తులు జాగారం చేస్తూ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉదయం, సాయంత్రం భక్తులతో శివలయాలు కిట కిటలాడాయి.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

ఆముదార్లంక (చల్లపల్లి): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం ఆముదార్లంకలో నిర్వహించారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు 198 ఇళ్లకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి పేదల కళ్లల్లో సంతోషాన్ని నింపారని చెప్పారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీకి ఇంతకంటే అత్యధిక సీట్లతో గెలిపించాలని కోరారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎ.అరుణ కుమారి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి ఇంకొల్లు శేషగిరి, సర్పంచ్ నడకుదుటి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు డొక్కు దేవేంద్రరావు, నాయకులు బుల్లియ్య (చినబాబు), సజ్జా బలరాం, అల్లంశెట్టి చలం పాల్గొన్నారు.



బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

పేదల అభ్యున్నతే ధ్యేయంగా జగన్ పాలన

మచిలీపట్నంటౌన్: పేదల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం మూడోరోజు 24వ డివిజన్‌లో నిర్వహించారు. కార్పొరేటర్ చిత్తజల్లు ప్రసన్న, డివిజన్ ఇన్‌చార్జి చిత్తజల్లు రాజుతో కలిసి పేర్ని కిట్టు గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి, ప్రజలకు ఆర్థిక భరోసా వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. 24వ డివిజన్ కన్వీనర్ కొణతం వీరనాగేశ్వరరావు, రాగం ధర్మరాజు, కార్పొరేటర్ పల్లి శేఖర్, నాయకులు పాల్గొన్నారు.



వృద్ధురాలి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

కామెడీ షోగా లోకేష్ పాదయాత్ర

పమిడిముక్కల(పామర్రు): లోకేష్ పాదయాత్ర పేరడీని తలపించే కామెడీ షోగా మారిందని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అన్నారు. మండలంలోని లంకపల్లి ఎట్టివానిగూడెంలో ఏర్పాటుచేసిన బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ సభలో ఎంపీ నందిగం సురేష్ మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు, తన బంధువులుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావిస్తారని పేర్కొన్నారు. ఆయా వర్గాలకు రాజ్యాంగ ఫలాలను అందిస్తున్నారన్నారు. చంద్రబాబు ఆ కులాలను చిన్న చూపు చూస్తూ హేళన చేస్తారని విమర్శించారు. మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు, మారపాక మహేష్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఏఎంసీ వైస్ చైర్మన్ కొడాలి రాంబాబు, సర్పంచ్ వేమూరి రత్నకుమారి, ఎంపీటీసీ మీర్జా సజాద్ అలీ, నాయకులు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, కనుమూరి వెంకటేశ్వరరావు, యలమంచిలి గణేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ నందిగం సురేష్

జగనన్నకు అండగా ఉండాలి

కైకలూరు: పేదల సంక్షేమానికి పథకాల ద్వారా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకుడు జయమంగళ వెంకటరమణ అన్నారు. టీడీపీ నుంచి ఇటీవల సీఎం సమక్షంలో పార్టీలో చేరిన జయమంగళను నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు ఆటపాకలో ఆయన నివాసంలో కలసి మద్దతు ప్రకటించారు. జయమంగళ మాట్లాడుతూ టీడీపీ కోసం అహర్నిశలు పని చేసినా మోసం చేశారని ధ్వజమెత్తారు. కొల్లేరులో పలు సమస్యలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారన్నారు. సీఎం ప్రేమగా తనను పార్టీలోకి ఆహ్వానించడాన్ని మరువనన్నారు. నాయకులు సయ్యపురాజు గుర్రాజు పాల్గొన్నారు.

నేడు గృహ సారథుల సమావేశం

బంటుమిల్లి: గ్రామ వలంటీర్లు, గృహ సారథుల సమావేశం సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు మల్లేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) ఆవరణలో జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం. రాజబాబు తెలిపారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. మండల పరిధిలోని గ్రామ వలంటీర్లు, గృహ సారథులు, నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.

ఎదురుమొండి దీవులకు బస్ నడపాలి

అవనిగడ్డ: నాగాయలంక మండల పరిధిలోని ఏటిమొగ ఫంట్ ద్వారా ఎదురుమొండి దీవులకు ఆర్టీసీ బస్ సర్వీసు ఏర్పాటు చేయాలని దివిసీమ ప్రయాణికుల సంఘం కన్వీనర్ మునగాల బాలకృష్ణారావు ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ ఫంట్‌పై నుంచి టెన్‌టైర్స్ భారీ లారీలు, పొక్లెయినస్, భారీ వాహనాలు వెళుతున్నాయని చెప్పారు. ఆర్టీసీ బస్‌ను ఈ ఫంట్‌పై నుంచి నడిపి ప్రయాణికులకు బస్ సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులను కోరారు.

27 నుంచి గంగానమ్మ జాతర మహోత్సవాలు

పామర్రు:ఈ నెల 27 నుంచి మార్చి 5 వ తేదీ వరకూ గంగానమ్మ తల్లి జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం సభ్యులు విలేకర్లతో మాట్లాడుతూ జాతర సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. మహోత్సవానికి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారని తెలిపారు. అమ్మవారి ఘటం కుండను, పోతురాజు గడలకు గ్రామోత్సవం మేళతాళాలు, కనకతప్పెట్లతో వైభవంగా ఊరేగింపు నిర్వహిస్తామని పేర్కొన్నారు. తొలిరోజు తెల్లవారు జామున గంగానమ్మ తల్లిని ఆమె పుట్టినిల్లు అయిన బొమ్మారెడ్డి మధుసూదనరెడ్డి (మునసబుగారి) ఇంటి వద్దకు తీసుకెళతారు. అక్కడ అమ్మవారికి విశేషంగా పూజలు నిర్వహిస్తారు. అనంతరం అక్కడి నుంచి పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను తీసుకొస్తారు. ఆలయంలో గంగానమ్మకు జాతర తొలిరోజున 108 మంత్ర జలాలతో అభిషేకం నిర్వహించి పుట్టింటి నుంచి తెచ్చిన వస్త్రాలను సమర్పించి, పసుపు కుంకుమలతో విశేషంగా అలంకరిస్తారు. అనంతరం అదే రోజు ఆలయం నుంచి గ్రామోత్సవానికి గంగానమ్మ బయలు దేరుతుందన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

మోపిదేవి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం మోపిదేవి సచివాలయం-1 పరిధిలో జరుగుతుంది. మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక శ్రీ బాషితా టాలెంట్ స్కూల్ నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గడప గడపకు సందర్శించి స్థానికుల సమస్యలు తెలుసుకుంటారు.

ఘనంగా జెండా పండుగ



మచిలీపట్నంటౌన్: ఖాజా గరీబ్ నవాజ్ అవులియా అల్లా దర్బార్ జెండా పండుగను ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వర్రెగూడెం అత్తర్ పస్నీర్ సాహెబ్ వీధిలోని జెండా వద్ద జెండా వ్యవస్థాపకుడు సయ్యద్‌పీర్ ఆధ్వర్యంలో దూపం, చందనం సమర్పించారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా మాట్లాడుతూ ఖాజా గరీబ్ నవాజ్ మహిమలను వివరించారు. డాక్టర్ నాగేశ్వరరావు, షేర్ అలీ, వైఎస్సార్ సీపీ 34వ డివిజన్ ఇన్‌చార్జి బడే భానుతేజ, రవి, సయ్యద్ ఇమామ్, బాబా పాల్గొన్నారు. సయ్యద్‌బాజీ పర్యవేక్షించారు.

● నయనానందకరం.. స్వామివార్ల జలవిహారం



కృత్తివెన్ను శివాలయం వద్ద కోనేరులో తెప్పోత్సవం

దుర్గాపార్వతీ సమేత నాగేశ్వరస్వామి, రమా సహిత వీర వెంకట సత్యనారాయణ స్వామి వార్ల జలవిహారం (తెప్పోత్సవం) నయనానందకరంగా సాగింది. మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం దేవదేవేరులను ప్రత్యేకంగా పూలతో అలంకరించిన హంస వాహనంపై ఉంచి ఆలయ కోనేరులో విహరింపజేశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు హరహర మహాదేవ శంభోశంకర అంటూ జయజయ ధ్వానాలు చేస్తూ స్వామివార్ల జల విహారాన్ని తిలకించారు. తెప్పోత్సవం సమయంలో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు.

– కృత్తివెన్ను

● వైభవంగా రథోత్సవం

పెదకళ్లేపల్లిలోని దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం రాత్రి స్వామివార్ల రథోత్సవం జరిగింది. ఆలయ అనువంశిక ధర్మకర్తలు యార్లగడ్డ సత్యదీప్ ప్రసాద్, శివరామ ప్రసాద్, రామేశ్వర ప్రసాద్, చల్లపల్లి రాజవంశీకులు స్వామివార్లకు హారతి ఇచ్చి టెంకాయ కొట్టి రథాన్ని ముందుకు లాగారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధర రావు ఆధ్వర్యంలో స్వామివార్లకు పూజలు నిర్వహించిన అనంతరం రథోత్సవం జరిగింది. దారిపొడవునా బాణసంచా కాల్చుతూ, డప్పు కళాకారుల సందడి, తీన్‌మార్ వాయిద్యాలతో గ్రామంలో సందడి నెలకొంది. పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

–పెదకళ్లేపల్లి(మోపిదేవి)



పెదకళ్లేపల్లిలో రథంపై ఊరేగుతున్న దుర్గా నాగేశ్వరస్వామి వారు